అట్రాసిటీ కేసులను పరిష్కరించాలి

● నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి

మాట్లాడుతున్న ఎంపీ హాజరైన ఎమ్మెల్యే విజయుడు, కలెక్టర్, ఎస్పీ

గద్వాల, ఆగస్టు 31: ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ సంతోష్, ఎస్పీ శ్రీనివాసులు, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడుతో కలిసి ఎంపీ మాట్లాడుతూ.. ప్రతి అధికారి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీలు జరగకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అట్రాసిటీ కేసులు వచ్చిన వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. పీపీ పెండింగ్‌లో ఉన్న ప్రతికేసును పరిశీలించాలన్నారు. బాధితులకు పరిహారం విషయంలో పూర్తి సహకారం అందించాలన్నారు. సమావేశానికి డీపీఎంసీ కమిటీ సభ్యులు హాజరు కాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సివిల్ రైట్స్ డే రోజు డీపీఎంసీ కమిటీ సభ్యులు ప్రతిగ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు వేగంగా పరిష్కరిస్తామని ప్రజలకు ప్రభుత్వం తరపున తోడుగా ఉండి న్యాయం చేస్తామని తెలిపారు. కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ.. ప్రస్తుతం జిల్లాలో 118 పెండింగ్ కేసులు ఉన్నాయని, తక్షణమే పరిష్కరించడానికి సంబంధిత శాఖల అధికారులు పనిచేయాలని ఆదేశించారు. ఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ పోలీస్ యంత్రాంగం ఎస్సీ, ఎస్టీ కేసుల విషయంలో జీరో టోలరెన్స్ విధానాన్ని అనుసరిస్తామని తెలిపారు. అలాగే ఎంపీ జిల్లాకేంద్రంలోని గురుకుల పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో ఆర్డీవో రాంచందర్, అధికారులు సరోజమ్మ, సుజితావి జురేఖ, రమేశ్‌బాబు, గోవిందనాయక్ పాల్గొన్నారు.

బాధితులకు పూర్తి సహకారం

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితులకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ రివ్యూపై కలెక్టర్ సంతోష్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితులకు ప్రభుత్వం భరోసా కల్పిస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసులను మూడు కేటగిరీలుగా విభజించామని, కేసు తీవ్రతను బట్టి నష్టపరిహారం వర్గీకరణ కేటగిరీల ఆధారంగా రూ.లక్ష నుంచి రూ.8లక్షల వరకు ఉంటుందన్నారు. అనంతరం జిల్లాలో నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటు చేయాలని కేంద్ర విద్యాశాఖ అధికారులు మంత్రికి వినతిప్రతం ఇచ్చినట్లు చెప్పారు. విద్యాపరంగా వెనుక బడిన గద్వాల జిల్లాలో 256 మంది విద్యావలంటీర్లను ఏర్పాటు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులను కోరగా.. సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ తెలిపారు. గద్వాల రైల్వేస్టేషన్ పరిధిలో ఉన్న 100 ఎకరాల స్థలంలో ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, సూపర్‌స్పెషాలిటీ దవాఖాన నిర్మించాలని రైల్వేశాఖ మంత్రిని కోరినట్లు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 2023 సెప్టెంబర్ నుంచి జూన్ 2024 వరకు 27 కేసులు నమోదయ్యాయని, 18 కేసులకు సంబంధించి బాధితులకు రూ.25లక్షల పరిహారం అందించినట్లు తెలిపారు. మిగిలిన కేసులకు బడ్జెట్ కేటాయించాలని ప్రభుత్వానికి నివేదించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జిల్లాలో మరో రెండు రోజులుపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సంతోష్ సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో విలేకరులతో మాట్లాడారు. రెండురోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున వాతావరణశాఖ రెడ్ అలర్ట్ ప్రకటించిందన్నారు. ప్రజలు అత్యవసరమైతే తప్పా బయటకు రాకూడదని సూచించారు. వర్షం కురిసిన సమయంలో ప్రజలకు ఏవైనా ఇబ్బందులు తలెత్తితే కలెక్టరేట్‌లో హెల్ప్‌లైన్ నెంబర్ 9100901605కి సంప్రదించాలని కలెక్టర్ కోరారు.

సమస్యలపై నివేదిక తయారు చేయాలి

దవాఖాన సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

● ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి టౌన్, ఆగస్టు 31: ప్రభుత్వ దవాఖానలో మరుగుదొడ్ల సౌకర్యానికి ఇబ్బందులుగా ఉన్నాయని, సమస్యల పరిష్కారానికి నివేదికను తయారు చేసి ఇవ్వాలని ఎమ్మెల్యే మేఘారెడ్డి అధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రి, సంక్షేమ హాస్టళ్లను శనివారం ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కళాశాలలో మరుగుదొడ్లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. గతంలో నిర్మించిన మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉన్నాయని కళాశాల అధ్యాపకులు చెప్పారని చెప్పారు. జిల్లా కేంద్రంలోని అర్బన్ గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. నియోజకవర్గంలో విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టిసారించడం జరిగిందని, ఈ రెండు అంశాలలో సమస్యలేవైన ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. అలాగే జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి ఆలయాల్లో శ్రావణ మాసం చివరి శనివారం కావడంతో ఎమ్మెల్యే మేఘారెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మహేశ్, కాంగ్రెస్ నాయకులు దేవన్ననాయుడు, అధికారులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE
★మహబూబ్‌నగర్, భగీరథ కాలనీ, E/F, 200 చ.గ.ల ప్లాటు అమ్మబడును, కంపౌండ్ వాల్, గేటు కలదు, క్లియర్ టైటిల్ సంప్రదించండి సెల్: 6301465612
NT-MBNR

KIDNY STONES
★మూత్ర పిండాల్లో రాళ్ల సమస్యకు ఆపరేషన్‌లేని హోమియో పరిష్కారం, 47 సం. అనుభవంతో 100% గ్యారంటీ, జయసూర్య హోమియో క్లినిక్ A Centre for Kidny Stones Opp: రైల్వే డిగ్రీ కాలేజ్, మెట్రో పిల్లర్ నం. 1058, తార్నాక, సికింద్రాబాద్. ఫోన్: 9866007924, 9550336677, 040-27000580
NT- 332617

ADMISSIONS
★Seats available in Engineering, Medical & other Courses in Colleges of Hyderabad. Contact: 7799111873, 7799111874.
NT-333107-All

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

CHANGE OF NAME
I, NOORA ALI D/o ALI ABDUL KHADEER, R/o H.No. 1-10-12/8/5/B, Shah Sahab Gutta, Mahabubnagar Town & Dist., T.G., hereby state that my name was recorded in my passport bearing No. E9208161 is NOORAH D/o ALI ABDUL KHADER. My actual and correct name as per Aadhar card is NOORA ALI D/o ALI ABDUL KHADEER.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

దవాజీపల్లిలో అలుగుపారుతున్న వెంకి చెరువు

పెద్దమందడి మండలంలో ఉధృతంగా పారుతున్న చెక్‌డ్యాం

ఎడతెరిపిలేని వాన

● ఉధృతంగా పారిన వాగులు, వంకలు
● నిండిన చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలు
● గద్వాల జిల్లాలో 402.8, వనపర్తి జిల్లాలో 47.7 మి.మీ. వర్షపాతం

ఉధృతంగా ప్రవహిస్తున్న పాతజంగమాయపల్లి వాగు

దవాజీపల్లిలో కోతకు గురైన ఎంజీకేఎల్ఐ కాల్వ

గద్వాల, ఆగస్టు 31: జోగుళాంబ గద్వాల జిల్లాలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం వరకు ఎడతెరిపి లేకుండా ముసురు వర్షం కురుస్తూనే ఉన్నది. జిల్లాలో అత్యధికంగా వర్షాపాతం ఇటిక్యాల మండలంలో 53.2మిల్లీ మీటర్ల వర్షాపాతం నమోదైంది. అతితక్కువ వర్షాపాతం అయిజ మండలంలో 12.2మిల్లీ మీటర్లుగా నమోదైంది. జిల్లా సరాసరి వర్షాపాతం 402.8 మిల్లీమీటర్లుగా నమోదు కాగా జిల్లా సరాసరి వర్షాపాతం 33.6మిల్లీ మీటర్లుగా నమోదైంది. వనపర్తి జిల్లాలో 47.7 మి.మీ. నమోదు కాగా.. అత్యధికంగా రేవల్లిలో 77.6 మి.మీ., అత్యల్పం చిన్నంబావి 21.8 మి.మీ. నమోదైంది.

ముసురు వర్షంతో ఇక్కట్లు

గట్టు, ఆగస్టు 31: మండలంలో శుక్రవారం రాత్రి నుంచి ముసురు వర్షం కురుస్తోంది. 19.4మి.మీ.వర్షపాతం నమోదైందని రెవెన్యూ అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా ముసురు వర్షంతో ఇక్కట్లు ఎదురవుతున్నాయి. మట్టిమిద్దెల్లో నివసిస్తున్న ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాగా వర్షం దరిమిలా అప్రమత్తంగా ఉండాలని ఎస్సై కేటీ మల్లేశ్ ప్రకటనలో పేర్కొన్నారు.

మల్దకల్ మండలంలో..

మల్దకల్, ఆగస్టు 31: మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. కాగా వర్షపాతం 41.6 మి.మీ.లుగా నమోదైందని తాసీల్దార్ మోహినుద్దీన్ తెలిపారు. ముసురు వర్షం కారణంగా జనజీవనానికి తీవ్ర అంతరాయం కలిగింది.

గోపాల్‌పేట మండలంలో..

గోపాల్‌పేట, ఆగస్టు 31: మండలంలో శుక్రవారం అర్ధరాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా జోరువాన కురుస్తుంది. వాగులు, వంకల్లో నీరు ప్రవహిస్తుంది. చెరువులు, కుంటల్లోకి నీరు చేరుతున్నది. వానలను దృష్టిలో పెట్టుకొని అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. శనివారం గోపాల్‌పేట మండలంలో 73.5 మి.మీ. వర్షాపాతం నమోదైనట్లు ఆర్ఐ యాదయ్య తెలిపారు. రేవల్లి మండలంలో 77.6 మి.మీ. వర్షాపాతం నమోదైనట్లు, రేవల్లిలో ఒకటి, శానాయిపల్లిలో ఒక మట్టిమిద్దె వానకు కూలినట్లు తాసీల్దార్ లక్ష్మీదేవి తెలిపారు.

పెద్దమంది మండలంలో..

పెద్దమందడి, ఆగస్టు 31: మండలంలో రెండురోజులుగా భారీ, ముసురు వర్షం కురుస్తుంది. దీంతో చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలలో జలకళను సంతరించుకున్నాయి. వాగుల్లో వర్షపు నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. చెక్‌డ్యాంలు అలుగులు పారుతుండడంతో ప్రజలు వీక్షించేందుకు తరలి వస్తున్నారు. కురుస్తున్న భారీ వర్షాలకు రైతన్నలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇంకా రెండు, మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ఆదేశాలు జారీ చేయడంతో ఇప్పటికే మండల అధికారులు అప్రమత్తమయ్యారు.

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం

చిన్నంబావి, ఆగస్టు 31: మండలంలో భారీ వర్షాలకు చెరువులు, కుంటలకు వరద నీరు వచ్చిచేరడంతో అలుగులు పారుతున్నాయి. వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వర్షాలకు కృష్ణానది పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాసీల్దార్ ఇక్బాల్ సూచించారు. జూరాల ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని కిందికి వదలడంతో కృష్ణానది ఉధృతంగా ప్రవహిస్తుందని మత్స్యకారులు చేపలవేటకు వెళ్లొద్దని సూచించారు.

రోడ్లన్నీ మురుగు, బురదతో చిత్తడి

ఆత్మకూరు, ఆగస్టు 31: 24గంటల నుంచి ఆకాశానికి చిల్లు పడినట్లు ఏకధాటిగా వర్షం కురుస్తూనే ఉన్నది. ఆగకుండా కురుస్తున్న ముసురుతో మండల వ్యాప్తంగా ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఆత్మకూరులో రోడ్లన్నీ చిత్తడిచిత్తడిగా మారిపోయాయి. మురుగు కాల్వలు పొంగి రోడ్లెక్కి పారుతుండగా.. రహదారులన్నీ బురదమయంగా మారాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో ఎలాంటి ప్రమాదాలు జరగలేదని తాసీల్దార్ రాజు స్పష్టం చేశారు. శనివారం 23.6 మి.మీ. వర్షం నమోదైనట్లు చెప్పారు. నదీ పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు అప్రమత్తంగా ఉండి ఎలాంటి ప్రమాదం జరిగినా ఉన్నతాధికారులకు సమాచార మివ్వాలని ఆదేశించారు.

అయిజ మండలంలో..

అయిజ, ఆగస్టు 31 : అయిజ మండలకేంద్రంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ఎడతెరిపి లేకుండా ముసురు కురుస్తున్నది. ముసురుతో జనం ఇంటి బయటకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ఆరుతడి పంటలకు ఈ వర్షం జీవం పోస్తున్నప్పటికీ పంటల్లో గడ్డి పడితే నష్టపోతామని రైతులు పేర్కొన్నారు.

ఉధృతంగా పాతజంగమాయపల్లి, సరళాసాగర్ వాగు

కొత్తకోట, ఆగస్టు 31: అల్పపీడన దోరణితో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పాతజంగమాయపల్లి సరళాసాగర్ వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. ఎగువనుంచి భారీగా వరద నీరు రావడంతో వాగు ప్రవహిస్తున్నట్లు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తెలిపారు. వాగులోని నీరంతా సరళాసాగర్ ప్రాజెక్టుకు చేరుతున్నది. వాగు ప్రవహిస్తుండడంతో గతంలో 12గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయేవి. మూడేండ్ల కిందట వాగుపై తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కృషితో రూ.12.40 కోట్లతో బ్రిడ్జి నిర్మించుకున్నారు. బ్రిడ్జి లేకపోవడంతో విద్యార్థులు, రైతులకు తీవ్ర ఇబ్బందులు ఉండేవి. బ్రిడ్జి నిర్మాణంతో స్థానికుల చిరకాల స్వప్నం నెరవేరింది.

పాన్‌గల్‌లో 86మి.మీ. వర్షపాతం

పాన్‌గల్, ఆగస్టు 31: మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం కురిసిన వర్షానికి 86 మి.మీ. వర్షపాతం నమోదైంది. రోడ్లన్ని చిత్తడిగా మారాయి. దవాజీపల్లిలో వెంకి చెరువు, ముందరి చెరువు నిండి అలుగు పారుతున్నాయి. దవాజీపల్లిలో కేఎల్ఐ ఎంజే-4 కాల్వ రైతు గోవర్ధన్‌రెడ్డి పొలం వద్ద కోతకు గురైంది. బుసిరెడ్డిపల్లిలో ఊరచెరువు, బొల్లిగట్టు చెరువు, సూరాయకుంట, కొత్తచెరువు తదితర చెరువులు అలుగు పారుతున్నాయి. మండల కేంద్రంలో పొల్కిచెరువు, ఈదుల చెరువు అలుగు పారేందుకు దరిదాపుల్లో నీరు చేరింది. మండలకేంద్రంలో కాశీనాథ్ మట్టి మిద్దె పాక్షికంగా కూలిపోయింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

ఉండవెల్లి మండలంలో..

ఉండవెల్లి, ఆగస్టు 31 : మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం నిరంతరాయంగా ముసురు వర్షం కురిసింది. ఉండవెల్లిలోని ఎస్సీ కాలనీలో చిన్న నాగమ్మకు చెందిన పాత ఇంటి గోడ కూలింది. దీంతో అక్కడే నిలిపిన ద్విచక్ర వాహనంపై గోడ కూలడంతో దెబ్బతిన్నది.

ఆత్మకూర్‌లో బురదమయంగా మారిన ప్రధాన రహదారి

వనపర్తి జిల్లాకేంద్రంలో కురుస్తున్న వాన

గుంతలమయంగా మారిన గద్వాల-డ్యాం రోడ్డు

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

● వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి టౌన్, ఆగస్టు 31: వర్షాలకు అప్రమత్తంగా ఉండాలని, రానున్న 24గంటల్లో వనపర్తి జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే అవకాశం ఉందని, వాతావరణ శాఖ జిల్లాకు రెడ్ అలర్ట్ జారీ చేసిందని అందుకు జిల్లాలో ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరుగకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులు, పంచాయతీ కార్యదర్శులు స్థానికంగా ఉండాలని సూంచారు. చెరువులు, కుంటలు తెగిపోవడానికి అవకాశం ఉందనే అంచనా ఉన్నవాటిని గుర్తించి జాగ్రత్తలు తీసుకోవాలని ఇరిగేషన్ శాఖ ఇంజినీర్లకు ఆదేశించారు. రోడ్లు, కల్వర్టులపై ప్రత్యేక దృష్టి సారించాలని.. ఒకవేళ తెగిపోయిన కల్వర్టులు ఓవర్ ఫ్లో అయిన వెంటనే అటువైపు ఎవరూ వెళ్లకుండా బారీకేడ్ ఏర్పాటు చేసి సిబ్బందిని ఉంచాలని ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న ఇండ్లను గుర్తించి కుటుంబాలను వెంటనే ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. మత్స్యకారులు చేపలవేటకు వెళ్లొద్దని, అదేవిధంగా పశువులను మేతకు పంపొంద్దని ప్రజలను కోరారు. కృష్ణానది పరివాహక గ్రామాలైన చింతరెడ్డిపల్లి, ఇర్లదిన్నె, నందిమల్ల, కిష్టంపల్లి, మూలమల్ల, జూరాల, గుంటిపల్లి, మోట్లంపల్లి, కత్తెపల్లి, ఆరేపల్లి, రేచింతల, వైశాగాపూర్, రామమ్మపేట, రంగాపురం, రాంపూర్, జనుంపల్లి, మునగమాన్‌దిన్నె, పెంచికలపాడు, బుర్దిపాడు, యాపర్ల, గడ్డబస్వాపురం, పెద్దమారు, చిన్నమారు, బెక్కెం, వెల్టూరు, సోలీపూర్, కాలూరు, చెన్నెపాడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తుఫాను వల్ల ఏదైన సమస్యలు వస్తే కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, కంట్రోల్ రూమ్ 08545233525, 08545220351 నెంబర్లకు ఫోన్ చేసి సహాయం పొందాలని సూచించారు. సమావేశంలో అదనపు

మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, నగేశ్, ఆర్డీవో పద్మావతి, జెడ్పీ సీఈవో యాదయ్య, డీఆర్డీవో ఉమాదేవి, ఇరిగేషన్ ఈఈ మధుసూదన్‌రావు, పంచాయతీరాజ్ ఈఈ మల్లయ్య, మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్, డీఎల్పీవో రఘునాథ్, వైద్యశాఖ ప్రోగ్రాం ఆఫీసర్ సాయినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్లపై ప్రయాణికుల ఇక్కట్లు

ధరూరు, ఆగస్టు 31: రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. గుంతలలో వర్షపు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా మండల కేంద్రంలో రాయిచూర్-గద్వాల రోడ్డుపై స్థానిక వైఎస్సార్ చౌరస్తా ఎరుకలి వీధి వద్ద తీవ్రమైన బురదతో ఇబ్బందులు పడుతున్నారు. పత్రికల్లో కథనాలు వచ్చిన అధికారులు మట్టి మాత్రమే నింపుతున్నారు తప్పా.. శాశ్వత పరిష్కారం చూపడంలేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. గట్టు వెళ్లేరోడ్డు ఆంజనేయస్వామి ఆలయం వద్ద గుంతలు పట్టించుకోక పోవడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడంలేదు. రోడ్లు ఎప్పుడు మారుతాయోనని ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

జూరాల కాల్వలో గల్లంతైన వ్యక్తి శవం లభ్యం

భారీ వర్షాన్ని సైతం లెక్క చేయకుండా మృతదేహాన్ని వెలికితీస్తున్న రెస్క్యూ టీం

పెబ్బేరు, ఆగస్టు 31: జూరాల ప్రధాన ఎడమ కాల్వలో శుక్రవారం సాయంత్రం గల్లంతైన వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైంది. ఎస్సై హరిప్రసాదరెడ్డి కథనం మేరకు.. పెబ్బేరు మండలం తోమాలపల్లె సమీపంలోని 44వ నెంబరు జాతీయ రహదారిపై ఘటన చోటుచేసుకున్నది. హైదరాబాద్‌కు చెందిన జావేద్ అంకిత్‌కుమార్ (35) తన స్నేహితుడు సోమ శంకర్‌తో కలిసి ఏపీలోని ఆదోనికి బైక్‌పై బయలు దేరారు. మార్గమధ్యంలో జూరా ల కాల్వ కనిపించడంతో స్నేహితులిద్దరు అక్కడ ఆగారు. సోమ శంకర్ కాలకృత్యాలకు వెళ్లగా, అంకిత్‌కుమార్ స్నానానికని కాల్వలోకి దిగాడు. నీటి ప్రవాహం అధికంగా ఉండడం..కాలు జారడంతో కాల్వలో కొట్టుకపోయాడు. మృతదేహాన్ని వెలికితీసేందుకు భారీ వర్షాన్ని కూడా లెక్కచేయకుండా పోలీసులు రెస్క్యూ చేశారు. నీటిప్రవాహ వేగానికి శవం లభ్యం కావడం కష్టమన్న అంచనాతో శ్రీరంగాపురం మండలం నాగసానిపల్లె వద్ద కాల్వ వంతెనకు చెట్ల కొమ్మలు అడ్డంగా వేసి శవం ముందుకు పోకుండా చేశారు. వారి కృషి ఫలించి శవం అక్కడికే చేరుకొని కనిపించడంతో పోలీసులే స్వయంగా కాల్వలోకి దిగి బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని వనపర్తి ఏరియా దవాఖానకు తరలించి కేసు నమోదు చేశారు.

విద్యను సేవగా భావించాలి

● ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట, ఆగస్టు 31: విద్యన వ్యాపారమనేది కాదని సేవాభావంగా భావించి గ్రామీణ విద్యార్థులకు మంచి బోధనను అందించాలని ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సూచించారు. శనివారం మండలంలోని పామాపురం జెడ్పీహెచ్ఎస్‌లో పని చేస్తున్న శేఖర్ పదవి విరమణ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అంతకుముందు పట్టణానికి చెందిన సూర సత్యనారాయణ పదవి విరమణ సందర్భంగా మెమెంటో అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ఎంతవో కృష్ణయ్య, సూరచంద్రశేఖర్, మేస్త్రీ శ్రీను, వరప్రసాద్, బాల్‌నారాయణ, రాజిరెడ్డి, పీజే బాబు, ఉమామహేశ్వర్‌రెడ్డి, గోపాల్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ అనివార్యం: ఎస్పీ

గద్వాల అర్బన్, ఆగస్టు 31: ప్రతి ఉద్యోగి జీవితంలో ఉద్యోగ విరమణ అనేది అనివార్యమని ఎస్పీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఇటిక్యాల పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందుతున్న వెంకటేశ్వర్లును శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సన్మానించారు. ఎస్పీ మాట్లాడుతూ.. వెంకటేశ్వర్లు పోలీస్‌శాఖలో 34ఏండ్లుగా సేవలందించారని, ఆయన సేవలు మరవలేనివని కొనియడారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ నయీం, సీసీ లోహిత్‌కుమార్ ఉన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

● వనపర్తి ఎస్పీ గిరిధర్

వనపర్తి టౌన్, ఆగస్టు 31: భారీ వర్షాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎస్పీ రావుల గిరిధర్ పోలీస్ సిబ్బందికి సూచించారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తుండాలని, భారీ వర్షాల కారణంగా అన్ని ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అత్యవసర సమయంలో డయల్ 100 లేదా పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. భారీ వర్షాల వల్ల వాగులు, వంకలు పొంగి ప్రవహించే వాటిని గమనిస్తుండాలని, వాటిని ప్రజలు దాటకుండా చూడాలన్నారు. చెట్ల కింద, పాత భవనాల కింద ఉండకుండా చూడాలన్నారు. రోడ్లపై వాహనదారులు నిదానంగా ప్రయాణించాలన్నారు. విపత్తు కాలంలో ప్రజలకు సేవలందించేందుకు పోలీస్ శాఖ అందుబాటులో ఉంటుందన్నారు. అందుకు జిల్లా ప్రజలు సహకరించాలని సూచించారు.

పదవీవిరమణ పొందిన సిబ్బందికి సన్మానం

పోలీస్ శాఖలో ఎస్సై, హెడ్‌కానిస్టేబుల్‌గా 40ఏండ్లపాటు విధులు నిర్వహించి పదవీ విరమణ పొందుతున్న సీసీఎస్ ఎస్సై మిస్బుద్దీన్, హెడ్ కానిస్టేబుల్ జానకిరాములును ఎస్పీ గిరిధర్ సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. కుటుంబాన్ని, వృత్తిని బ్యాలెన్స్ చేసుకుంటూ క్రమశిక్షణతో పోలీస్ శాఖలో పనిచేస్తు ప్రజల మన్ననలు పొందారని గుర్తుచేశారు. అనంతరం ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రామదాస్ తేజావత్, డీఎస్పీ శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై మునినాయక్, సీఐ నాగభూషణం, అప్పలనాయుడు ఉన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే బీరం జన్మదిన వేడుకలు

చిన్నంబావి, ఆగస్టు 31: కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ఘన